
నవశక్తుల వేషధారణలు


జగిత్యాలలో శోభాయాత్ర


పోతురాజుల విన్యాసాలు

అమ్మా బైలెల్లినాదో..

జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. జగిత్యాల పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా అమ్మవారి విగ్రహాలను శోభాయాత్రగా మంటపాలకు తరలించారు. శోభాయాత్రలో డప్పు వాయిద్యాలు, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శనలు, పోతురాజుల విన్యాసాలు, దుర్గామాత వేషధారణలతో ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

రైతు సమస్యలపై దృష్టి

పొలం బాట పట్టిన విద్యుత్తు అధికారులు

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం

నిరంతరం మెరుగైన విద్యుత్తు సరఫరాపై దృష్టి సారించటంతోపాటు.. సమస్యలను పరిష్కరించేలా ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. రైతు సమస్యలను పరిష్కరించేందుకు 'పొలం బాట' కార్యక్రమం ప్రారంభించారు. విద్యుత్తు అధికారులు రైతుల వద్దకు వెళ్తున్నారు. సీఎండీ ప్రత్యేక దృష్టి సారించటంతో సమస్యలు కొంతలో కొంత పరిష్కారమయ్యేలా కనిపిస్తోంది.

జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో గత రబీ సీజన్‌లో వరి కోత కోసేందుకు పొలంలో నడుచుకుంటూ వెళుతున్న నలువాల నర్సయ్య అనే రైతు తెగిపడిన విద్యుత్తు తీగలను గమనించక విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. కనీసం పరిహారం కూడా రాలేదు. ఇలా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చాలా ఏళ్ల కిందట వేసిన లైన్లు కొన్ని శిథిలావస్థకు చేరి తీగలు దెబ్బతిని తెగిపోతున్నాయి. వాటిని గుర్తించి కొత్త లైన్లు వేయాల్సి ఉంటుంది. సమస్యపై దృష్టి సారించకపోవడంతో ఏటా ప్రమాదాలకు గురై చాలా మంది మృత్యువాతపడుతున్నారు. సంస్థ పరిహారం అందిస్తున్నప్పటికీ సమస్యలను పరిష్కరిస్తే ప్రమాదాలు జరగవని రైతులు పేర్కొంటున్నారు. విద్యుత్తు స్తంభాలపై ఇన్సులేటర్లు చెడిపోయి, సపోర్టు ఇన్సులేటర్ దెబ్బతిని విద్యుత్తు సరఫరా అయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇండక్షన్ రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

జిల్లాలో మొత్తం 5,04,252 విద్యుత్తు కనెక్షన్లు ఉండగా ఇందులో గృహ 3,21,776, వాణిజ్యం 36,526, వ్యవసాయం 133,880 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 22,920 విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయి. జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తున్న అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. స్తంభాలు వంగిపోయినా, వదులు తీగలు, నియంత్రికల వద్ద ఎర్తింగ్ వైర్లు చెడిపోవటం, ఇన్సులేటర్లు దెబ్బతిని ప్రమాదాలు జరగటం తదితర సమస్యలపై దృష్టి సారించటంతోపాటు, రైతుల మోటార్లకు కెపాసిటర్లను కూడా బిగించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. నెల రోజుల కిందట ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినప్పటికీ అంతగా స్పందన లేకపోవటంతో సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించటంతో అధికారులు పొలాలకు తరలుతున్నారు. సమస్యలను నమోదు చేసుకుంటూ సాధ్యమైనవి పరిష్కరిస్తున్నారు. పెద్ద పనులకు నివేదికలు తయారు చేస్తున్నారు.


రైతులతో విద్యుత్తు అధికారులు

90 శాతం మేర పూర్తి - సాలియా నాయక్, ఎస్ఈ



డీఈలు, ఏడీఈలు, ఏఈలు క్షేత్ర స్థాయిలో తిరుగుతున్నారు. ఇప్పటికే 90 శాతం మేర పూర్తి చేశారు. ఈ కార్యక్రమం నిరంతరం ఉంటుంది. రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారు. ప్రమాదాలు కొని తెచ్చుకోకుంటూ ఏదైనా సమస్య ఉంటే సిబ్బందికి తెలియజేయాలి. లూజ్ వైర్లు, వంగిన స్తంభాలను బాగు చేస్తాం. రైతులు కూడా కెపాసిటర్లు బిగించుకోవాలి.

స్వశక్తి మహిళలకు అండ

స్త్రీనిధి ద్వారా విద్యుత్తు వాహనాలు

న్యూస్‌టుడే, సారంగాపూర్

పర్యావరణ పరిరక్షణకు, రవాణా సౌకర్యం పెంపొందించేందుకు స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు విద్యుత్తు వాహనాలను అందించేందుకు స్త్రీనిధి, బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. పెరుగుతున్న కాలుష్యం తగ్గించడమే కాకుండా పెట్రో ధరల పెరుగుదలతో సాధారణ కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటన్నింటిని అధిగమించి, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీ ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాలీలను అందించేందుకు ముందుకొచ్చాయి. ఇందులో భాగంగా ఇప్పటికే స్త్రీనిధి అధికారులు స్వశక్తి సంఘాలలోని మహిళా సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్త్రీనిధి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలకు విద్యుత్తు వాహనాలపై రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.లక్ష వరకు అందిస్తుండగా, ఆటోలు, ట్రాలీ ఆటోలపై రూ.3 లక్షల వరకు స్త్రీనిధి రుణాన్ని అందిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటికే దాదాపు 75 వరకు ద్విచక్ర వాహనాలను మహిళలకు అందజేయగా, వ్యాపార పరంగా ప్రోత్సహించేందుకు ప్యాసింజర్, ట్రాలీ ఆటోలను అందించేందుకు ముందుకొచ్చారు.


మహిళలకు అందించిన ద్విచక్ర వాహనాలు (పాతచిత్రం)

డబ్బులు ఆదా

పర్యావరణ పరిరక్షణకు ఈ-బైక్, ఆటోలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇంధన ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో విద్యుత్తు వాహనాలతో డబ్బులు ఆదా చేసుకునే అవకాశముంటుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహనాలు అందించగా, ఆటో, ట్రాలీ ఆటోలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించేలా చూస్తున్నాం.

- భూ కైలాస్, స్త్రీనిధి, జిల్లా ఇన్‌ఛార్జి

అర్హులు ఎవరంటే..

- స్వశక్తి సంఘంలో సభ్యురాలిగా, సంఘ లావాదేవీల సరిగా ఉండి, మూల ధనం చెల్లించిన మహిళలను రుణానికి అర్హులుగా పరిగణిస్తారు.
- సంఘ ఆర్థిక లావాదేవీల్లోని ఏ, బీ, సీ, డీ గ్రేడ్లలో ఏదైనా కేటగిరీలో తప్పనిసరిగా సంఘంలో సభ్యురాలై ఉండాలి.
- గతంలో స్త్రీనిధితో సంఘానికి బకాయి ఉండకుండా చూసుకోవాలి.
- ఒక సభ్యురాలు గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణం తీసుకునే అవకాశముంది.
- ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాలీ ఆటోలకు 11 శాతం వడ్డీపై స్వశక్తి మహిళలకు స్త్రీనిధి రుణాన్ని అందించనున్నారు.
- ద్విచక్ర వాహనానికి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు అందిస్తుండగా, అదేవిధంగా ఎలక్ట్రిక్ ఆటో/ ట్రాలీ, ప్రయాణికులను తరలించే ఆటోలపై రూ.3 లక్షల వరకు అందిస్తున్నారు.
- ఇందులో సభ్యురాలు 10 శాతం మార్జిన్ మనీ చెల్లిస్తే, మిగతా ఇచ్చిన రుణాన్ని 60 నెలల్లోపు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుంది.
- రుణం తీసుకున్న మహిళకు స్త్రీనిధి ద్వారా బీమా కూడా వర్తించనుంది.

పకడ్బందీగా డిజిటల్ కార్డుల సర్వే

జగిత్యాల, న్యూస్‌టుడే: డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం జగిత్యాల మండలం ఒడ్డెరకాలనీలో పైలెట్ సర్వే తీరును పరిశీలించారు. సర్వే బృందం ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు నమోదు చేయాలని పొరపాట్లు జరగవద్దన్నారు. ప్రభుత్వం అన్ని వివరాలతో డిజిటల్ కార్డు రూపొందిస్తున్నందున అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే నమోదు చేసుకోవాలని ఎలాంటి పొరపాట్లు జరగవద్దన్నారు. బాధ్యులైన అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని కలెక్టర్ అన్నారు. ఆర్డీవో పి.మధుసూదన్, ఎంపీడీవో కె.రమాదేవి, ఎంపీవో కె.రవిబాబు తదితరులున్నారు.


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల : ధాన్యం కొనుగోలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో దృశ్య సమీక్ష నిర్వహించగా జగిత్యాల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల ఎంపిక తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జగిత్యాల క్రీడావిభాగం : జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు బాక్సింగ్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దుగ్యాల రాఘవ్, సాకేత్, వరుణ్, అమాన్ పాషా, సాయిమణి, స్వరాలి, మనస్వి, హంసిక, రాంచరణ్, శివ, తేజస్విని, జైద్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. షేక్‌పేటలో ఈ నెల 5, 6న నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు సాగర్, అరుణ్, మహిపాల్, నరేశ్, శిక్షకులు వంశీక్రిష్ణ, రామక్రిష్ణ అభినందించారు.




నేడు రైతుల ధర్నా

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల కలెక్టరేట్ ఎదుట రైతు రుణమాఫీ కోసం శుక్రవారం రైతులు ధర్నా తలపెట్టారు. జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు వారంరోజులుగా జగిత్యాల, మల్యాల, రాయికల్, సారంగాపూర్, గొల్లపల్లి తదితర మండలాల్లోని అన్ని గ్రామాల్లోకి రైతు సంఘాల ప్రతినిధులను కలిశారు. రైతు ధర్నాకు అధిక సంఖ్యలో రావాల్సిందిగా కోరారు. రాజకీయాలకు అతీతంగా రైతు ధర్నా చేపడుతున్నట్లు జిల్లా రైతు ఐక్యవేదిక నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి తెలిపారు.

క్రిప్టో మాయ! 6లో

రాకపోకలు నిలిచినా మరమ్మతులు కరవు


కోరుట్ల - సంగెం ఫుల్ వాగులో వరదలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

కోరుట్ల పట్టణ శివారు సంగెం రోడ్‌లోని ఫుల్‌వాగులో ఏడేళ్ల క్రితం రూ.2.80 కోట్లతో వంతెన, చెక్‌డ్యాం నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో కేవలం పిల్లర్లు నిర్మించి వదిలేశారు. ఈమార్గం గుండా సంగెం, నాగులపేట గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వాగులో వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో తాత్కాలిక రోడ్డు పైనుంచే ఏళ్లుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో వాగులో వరద పోటెత్తడం.. తాత్కాలిక రోడ్డు దెబ్బతినడం పరిపాటిగా మారింది. నీటి ప్రవాహం వెళ్లేలా ఏర్పాటు చేసిన పైపులు, వాటి మీద పోసిన మట్టి ఇటీవల పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు అవతలివైపు ఉన్న వందల ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో పది కిలోమీటర్ల దూరం తిరిగి సంగెం మీదుగా వెళ్తున్నట్లు అన్నదాతలు వాపోయారు. వాగులో నీటి ప్రవాహం తగ్గినందున తాత్కాలిక రహదారికి యుద్ధప్రాతిపదికన తగిన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోరుట్ల

332 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ధరూర్‌క్యాంపు టీచర్స్ భవన్‌లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుండగా గురువారం 397 మంది పత్రాలు పరిశీలించాల్సి ఉండగా 332 మంది హాజరయ్యారు. 65 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ కేటగిరి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని అధికారులు తెలిపారు.


ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

సాంకేతికత.. సృజనాత్మకత



న్యూస్‌టుడే, కరీంనగర్ కొత్తపల్లి

వాహన చోదకుడు నిద్ర పోకుండా అలారంతో అప్రమత్తం చేసే కళ్లజోడు.. మట్టిలోని తేమ తగ్గితే మోటారును ఆన్ చేసే మోటారు.. భూగర్భ గనుల్లో విషవాయువులను గుర్తించి కార్మికులను హెచ్చరించే పరికరం.. విద్యుదాఘాతం, విద్యుత్తు వృథాను తగ్గించే నీటి హీటర్.. ఇలా ఎన్నో సాంకేతిక పరికరాల తయారీకి విద్యార్థులు, యువతీ యువకులు మేధస్సుకు పదును పెట్టారు. ప్రజా సమస్యలకు తమవంతుగా పరిష్కారం చూపుతూ సృజనాత్మకత చాటారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాల్లో భాగంగా ఇటీవల కరీంనగర్ పురాతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాలో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులపై 'న్యూస్‌టుడే' కథనం.

1 ప్రదర్శన పేరు 2 భాగస్వాములైన విద్యార్థులు 3 కళాశాల/పాఠశాల 4 పని చేసే విధానం 5 ఉపయోగం

రైతు కష్టాన్ని తగ్గించి.. ప్రమాదాలు దూరం

1 ఆటోమేటిక్ తేమ డిటెక్టివ్ మోటార్
2 నక్షత్ర, ఆర్.జ్యోత్స్న, కె.వర్షిక ప్రియ
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 తేమ సెన్సార్‌ను భూమిలో పాతిపెట్టి డివైస్‌ను ఏర్పాటు చేయాలి. పంట పొలాల్లో తేమ తగ్గితే వెంటనే మోటార్‌ను ఆన్ చేసి సరిపడిన నీరు అందించి.. తర్వాత మోటార్‌ను ఆఫ్ చేస్తుంది.
5 రైతులకు విద్యుదాఘాతం నుంచి రక్షణతోపాటు శ్రమ తగ్గుతుంది. సకాలంలో పంటకు నీరు అందించడంతో దిగుబడి పెరుగుతుంది. రైతు పంట పొలానికి వెళ్లాల్సిన అవసరం లేదు. నీరు వృథా కాదు.



స్విచ్ వేయకుండానే తిరిగే పంకాలు, వెలిగే లైట్లు

1 ఆటోమేటిక్ పరికరాలు 2 జె.అఖిల, ఎ.శ్రీనిత్య
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 ఇంట్లో ఫ్యాన్లు, దీపాలు, సంప్ మోటారు ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈ పరికరాన్ని అనుసంధానం చేయాలి. చేతితో ముట్టుకోకుండా అరచేతులు కొట్టినా, మాట వినిపించినా వస్తువులన్నీ ఆన్ అవుతాయి.. వద్దనుకుంటే ఆఫ్ అవుతాయి.
5 విద్యుదాఘాతం నుంచి రక్షణ, ఇంట్లో మహిళలు, వృద్ధులకు అనుకూలమైంది. విద్యుత్తు ఆదా. . శ్రమ తగ్గుతుంది.



డ్రైవర్ నిద్రపోకుండా.. అప్రమత్తం చేసేలా..

1 డ్రైవర్‌ను మేల్కొల్పే అలారం 2 పి.సాహితి, ఎం.అఖిల
3 తిమ్మాపూర్ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల
4 నిద్రలేకనో, అలసిపోయో డ్రైవర్లు నిద్రలోకి జారుకుంటే (మూడు సెకన్ల కంటే ఎక్కువ సమయం దాటితే) కళ్లద్దాలు గుర్తించి అలారం మోగి.. డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయి. అంతటితో ఆగకుండా ఇంజిన్ వద్ద ఉన్న డివైస్ వాహన వేగాన్ని తగ్గిస్తుంది.
5 రోడ్డు ప్రమాదాల నివారణ. ప్రాణాలకు రక్షణ



గని కార్మికులకు రక్షణ..

1 మైనింగ్ సేఫ్టీ క్యాప్
2 ఎం.జాహ్నవి, జి.భావన
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 గనుల్లో పని చేస్తుండగా విషవాయువులు బయటకు వచ్చినప్పుడు కార్మికులు ఈ క్యాప్‌ను ధరించి ఉంటే ప్రమాదం నుంచి బయటపడొచ్చు.
5 అలారం మోగిన వెంటనే కార్మికుడు అప్రమత్తమై మాస్కులు, ఆక్సిజన్ ధరిస్తే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు.



ప్రమాద రహిత వేడి నీటి యంత్రం


1 అధునాతన హీటర్
2 యు.శృతి, బి.చరణ్
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 హీటర్‌కు పరికరాలను అమర్చి.. నీటిలో ఉంచినప్పుడు సెన్సార్లు లవణాలను గ్రహించి విద్యుత్తు ప్రవహించి వేడిని అందిస్తుంది. దానిని బయటకు తీస్తే సెన్సార్లకు లవణాలు అందకపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోతుంది.
5 ఇంట్లో పిల్లలు, మహిళలు విద్యుదాఘాతం బారిన పడకుండా చూసుకోవచ్చు. ప్రమాదాలు, ఆస్తి నష్టం జరగదు.



భూమిలో కరిగే సంచి

రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేలా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. నర్సరీల్లో ఏటా లక్షల్లో మొక్కలు నాటేందుకు విత్తనాలు వేసి మొక్కలు పెంచడానికి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఎకో లాస్టిక్ బ్యాగులు వినియోగంలోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలోచన విధానాలకు అనుగుణంగా మేయర్ సునీల్‌రావు, అప్పటి కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ చొరవతో భూమిలో కరిగి పోయే బ్యాగులను వాడేందుకు మొగ్గు చూపారు. పద్మనగర్ సమీపంలోని బుల్ సెమన్ సెంటర్‌లోని నర్సరీలో 20 వేల సంచులలో మొక్కలు నాటారు. వీటిని ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. ఈ సంచి నాలుగు నెలల్లోనే భూమిలో కరిగిపోయి ఎరువుగా మారుతోందని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, కరీంనగర్ సుభాష్‌నగర్



ఎకో లాస్టిక్ సంచులలో పెంచిన మొక్కలు



నేను ప్లాస్టిక్ కాను అని రాసి ఉన్న సంచి

కొత్తపత్తి గరిష్ఠ ధర రూ.6,900

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 18 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,900 ధర పలికింది. 3 ట్రాలీల పాత విడి పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.7,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. బస్తాల కొత్తపత్తికి రూ.5,000 నుంచి రూ.6,600 ధర పలికింది. మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం బిడ్డింగ్‌ను పరిశీలించారు. అధిక తేమశాతంతో పత్తి ధర తక్కువ పలుకుతుందని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి 8 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం : శ్రీరామసాగర్‌కు ఎగువ నుంచి 8525 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులు, 80.501 టీఎంసీల నీరు నిలువ ఉండగా, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతీ కాలువలకు 500, గుత్పకు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వరద ఎక్కువగా రాకపోవడంతో గేట్లను మూసివేశారు.

క్రిప్టో మాయ!

లాభాలు వస్తాయని జనం పెట్టుబడులు ◆ కొన్ని యాప్‌లు మూసివేస్తున్నా మారని తీరు

న్యూస్‌టుడే, మేడిపల్లి

రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్యతరగతి వారిని ఆకర్షిస్తోంది. క్రిప్టో కరెన్సీ పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న మార్కెటింగ్ వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. నిర్మల్ జిల్లాలో క్రిప్టోకరెన్సీ ఏజెంట్లపై కేసులు నమోదు కావడంతో ఆన్‌లైన్ పెట్టుబడులు తిరిగి వస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే.. చాలా మంది నష్టపోయారని జరుగుతున్న ప్రచారం మధ్య పెట్టుబడిదారులు అయోమయంలో ఉన్నారు. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం... ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది.



■ కోరుట్లలో హార్వెస్టర్‌లు రెండూ అమ్మేసి ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టాడు. వాటి రికవరీ కోసం మరి కొంతమందిని చైన్ లింకింగ్‌లో చేర్పించేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు.

■ పెగడపల్లి మండలంలోని ఓ గ్రామంలో పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు తేడా లేకుండా ఇంటింటికీ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

■ కోరుట్లలోనే ఓ వ్యాపారి రూ.కోటికి పైగా పెట్టుబడి పెట్టినట్లు ప్రచారం జరుగుతుండగా కొద్దిశాతం తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు.

■ మేడిపల్లి మండలంలోని రెండు మూడు గ్రామాల్లో ఈ తరహా పెట్టుబడులు పెద్దఎత్తున పెట్టగా కొందరు దేశ, విదేశాల ట్రిప్పులు తిరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

■ తాము పెట్టుబడి పెట్టిన యాప్ ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఇటీవల జగిత్యాలకు చెందిన ఓ ఏజెంట్ వద్దకు పలువురు పరుగులు తీశారు. తాను కూడా మోసపోయానని ఏజెంట్ చెప్పినా బాధితులు వినకపోవడంతో గొడవ జరిగినట్లు తెలిసింది.

■ జగిత్యాల జిల్లా కోరుట్ల, మల్యాల, పెగడపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

సార్లు... స్టార్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ ఏజెంట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయగా ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయుల పాత్ర పైనా చర్చ జరుగుతోంది. ఆయా జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు ఇటీవల విదేశాలకు వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగులు ఇతర దేశాలకు వెళ్లాలంటే శాఖాపరమైన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పలువురు నిబంధనలకు వ్యతిరేకంగా విదేశాలకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. బిట్ కాయిన్, క్రిప్టోకరెన్సీ చైన్‌లింకింగ్ విస్తరించిన కొద్దీ 3 స్టార్, 5 స్టార్, 7 స్టార్... ఇలా గుర్తింపు ఇస్తారు. పలువురు సార్లు స్టార్లుగా ఎదిగే ప్రయత్నంలో నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది.



రియల్.. ఢమాల్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముఖ్యంగా జగిత్యాల జిల్లాలో భూములకు సంబంధించిన లావాదేవీలపై క్రిప్టో కరెన్సీ ప్రభావం పడింది. పొరుగునే ఉన్న ఆర్మూరు, నిర్మల్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో చైన్ లింకింగ్ కొనసాగుతుండటం, అధిక వడ్డీ ఆశించి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. 8 నుంచి 12 నెలలుగా బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ పేరిట అమాయకులను పలువురు ఆకర్షించడంతో సామాన్యులు కూడా పెట్టుబడులు పెడుతున్నారు. కొన్ని కరెన్సీలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఉండటంతో అవి తిరిగి వస్తాయా లేదా అని తెలియకున్నా చాలా మంది పెట్టుబడులు పెట్టారు. చాలా మంది భూములు తనఖా పెట్టి, అప్పులు తెచ్చి చైన్‌లింకింగ్‌లో చేరారు. గతంలో క్యూనెట్ పేరిట మోసపోయినా ఈ విడత పలు యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి కొందరు మోసపోగా మరికొందరు తమ పెట్టుబడి తిరిగి వస్తుందా లేదా అనే మీమాంసలో ఉన్నారు. రూ.లక్ష నుంచి పెట్టుబడులు పెట్టిన వారికి నెలకు కొంత మొత్తంలో రిటర్న్స్ వస్తుండటంతో చాలా మంది పెట్టుబడుల కోసం ఎగబడ్డారు. లాభాల ఆశతో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టిన వారూ ఉన్నారని ప్రచారం జరుతుతుండటం విశేషంగా చెప్పుకుంటున్నారు. కొన్ని నెలలు సజావుగా లావాదీవీలు జరిగినా సంబంధిత యాప్ ఆన్‌లైన్‌లో కనిపించని సందర్భాల్లో లబోదిబోమంటున్నారు. కేవలం జగిత్యాల జిల్లాలో రూ.800 నుంచి రూ.1,000 కోట్ల వరకు క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరుగుతుండటం, ఇదే సమయంలో రియల్ వ్యాపారం దెబ్బతినడంతో ఊహాగానాలకు ఊతమిచ్చినట్లవుతోంది.

పేర్లు ఏవైనా... పెట్టుబడులే లక్ష్యం

ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెట్టడమే కానీ మోసం జరిగితే ఎలా ముందుకు పోవాలో తెలియకున్నా ఊళ్లకు ఊళ్లే గొలుసుకట్టులో పెట్టుబడులు పెడుతున్నారు. ఇటీవల వీఎంటీ, రెక్సోర్స్ యాప్స్ పేరిట పలువురు ఏజెంట్లు పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. రూ.లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.16 వేలు వస్తాయని చెప్పడంతో పలువురు ముందుకు వచ్చారు. కొందరికి నెలనెలా రూ.16 వేల చొప్పున వచ్చాయని చెప్పడంతో నిజమో కాదో తెలియకున్నా మరింత మంది పెట్టుబడులు పెట్టారు. ఈ చైన్‌లింకింగ్‌లో కమీషన్ పెరిగిన కొద్దీ ఏజెంట్లకు స్టార్లు పెరుగుతూ వస్తాయి. 5 స్టార్ వచ్చిన వారికి రూ.2 కోట్ల వరకూ వస్తాయని చెప్పడంతో ఎక్కువ మంది పెట్టుబడుల కోసం ఎగబడుతున్నారు. చైన్ లింకింగ్‌లో టార్గెట్ చేరుకున్న ఏజెంట్లు, రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టినవారు జపాన్, యూకే, సింగపూర్, బ్యాంకాక్ తదితర దేశాలు ట్రిప్పుల పేరిట తిరిగి వస్తున్నారు. దేశంలోని గోవా లాంటి పర్యాటక ప్రాంతాలకు ఒక్కో విమానాన్ని బుక్ చేస్తుండటం, వాటిల్లో ఏజెంట్లను తిప్పుతుండటం ఈ వ్యాపారంకు ఉన్న క్రేజీని తెలుపుతోంది. గతంలో చాలా మంది క్యూనెట్ ద్వారా కూడా చైన్ లింకింగ్ పేరిట పెట్టుబడి పెట్టి మోసపోయారు. అయినా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పెట్టుబడులు సురక్షితమో కాదో తెలియకున్నా చాలా మంది అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెడుతున్నారు.

భార్య దూరమై.. మద్యానికి బానిసై

ఒంటరితనంతో మేస్త్రీ ఆత్మహత్య

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నాలుగేళ్ల కిందట పెళ్లయింది.. సంతానం లేదు.. రెండు నెలల కిందట జ్వరం బారిన పడి భార్య మృతి చెందింది.. ఒంటరితనం భరించలేక అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు.. చివరికి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రాంప్రసాద్(28), ప్రణవి దంపతులకు సంతానం లేదు. అతడు మేస్త్రీ పని చేస్తుండగా భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. రెండు నెలల కిందట ప్రణవి జ్వరం బారిన పడింది. చికిత్స పొందుతూ డెంగీ లక్షణాలతో మృతి చెందింది. భార్య మరణం రాంప్రసాద్‌ను తీవ్రంగా కుంగదీసింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.



రాంప్రసాద్

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో ఏడుగురు గాయపడిన ఘటన జమ్మికుంట ప్రాంతంలో చోటుచేసుకుంది. బుధవారం కోరపల్లికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అక్షర ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అదే రోజు అదే గ్రామానికి చెందిన పి.గట్టమ్మ, గండీ స్వరూపలు కుక్కల దాడిలో గాయపడ్డారు. గురువారం కోరపల్లికి చెందిన రాజశేఖర్, టి.రాజమల్లు, పొల్సాని కృతిక్‌రావు, జమ్మికుంట పుర పరిధి కొత్తపల్లికి చెందిన రమ కుక్క కాటుకు గురయ్యారు. అక్షర పెదవి వద్ద తీవ్రగాయం కావడంతో కుటుంబీకులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రెండు రోజుల వ్యవధి కోరపల్లిలో కుక్కల దాడిలో ఏడుగురు గాయపడటంతో గ్రామస్థులు పంచాయతీ భవనం వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామంలో పిచ్చికుక్కలను చంపేయాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. కుక్కల తీవ్రతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించానని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని గ్రామ పంచాయతీ కార్యదర్శి తారకరామారావు తెలిపారు.

రాగి తీగ చోరీ కేసులో నిందితుల అరెస్టు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు దుకాణంలో రాగి తీగ చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ గురువారం సుల్తానాబాద్ ఠాణాలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. శాస్త్రీనగర్‌లోని నరేందర్‌రెడ్డికి చెందిన దుకాణంలో సెప్టెంబరు 23న అర్ధరాత్రి దొంగలు చొరబడి 300 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన గుర్రాల చిన్నభూమయ్య, పిట్టల సురేందర్, సిలివేరి శంకరయ్య, కడమండ శ్రీకాంత్, బెల్లంపల్లికి చెందిన గోషిక కార్తీక్‌లు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన 300 కిలోల రాగిని ఆటోలో బెల్లంపల్లికి తరలించి పసుపులేటి శ్రీనివాస్‌కు 250 కిలోలు అమ్మి రూ.లక్ష తీసుకొని పంచుకున్నారు. 50 కిలోల రాగిని చిన్నభూమయ్య తన వద్దే ఉంచుకున్నాడు. వ్యాపారి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 250 కిలోల రాగి నుంచి 50 కిలోలను హైదరాబాద్‌కు చెందిన రాముకు విక్రయించాడు. నిందితులు సురేందర్, శంకరయ్య, శ్రీకాంత్, కార్తీక్, శ్రీనివాస్‌లను గురువారం అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్రవాహనం, 200 కిలోల రాగిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గుర్రాల చిన్నభూమయ్య, హైదరాబాద్‌కు చెందిన రాము పరారీలో ఉన్నారు. పిట్టల సురేందర్, సిలివేరు శంకరయ్య గతంలో మందమర్రి, మంథని, కాటారం ఠాణాల్లో నమోదైన దొంగతనం తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కేసును ఛేదించిన సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అన్నను చంపిన తమ్ముడు..

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్‌రాజును హత్య చేసిన అతని సోదరుడు విక్రమ్‌రాజును గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న ఇంటి వద్ద భూతగాదాలతో అన్నను రోకలి బండతో మోదీ తమ్ముడు హత్య చేశాడని నిందితుడి కోసం గాలించగా అంతర్గాం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. దాచిపెట్టిన రోకలి బండను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కరీంనగర్ విద్యావిభాగం : ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జిల్లాలో గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయంలో జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సి.హెచ్.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షకు 54 మందికిగాను 31 మంది, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షకు 48 మందికిగాను 31 మంది హాజరయ్యారని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

వీరి పరుగు ఆగదు..

సత్తా చాటిన పోలీసులు

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 21 కిలోమీటర్లు పరుగు తీయాలంటే కొంచెం కష్టమే. కానీ ఈ పోలీసులకు అది సులువు. హాఫ్ మారథాన్(21 కిలోమీటర్లు) పరుగెత్తి సత్తా చాటారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. రామగుండం, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు పరుగుపై దృష్టి సారించారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ప్రతిభ చాటిన వీరిపై 'న్యూస్‌టుడే' కథనం.

మరిన్ని మారథాన్‌లకు హాజరవుతా..

ఏఆర్ కానిస్టేబుల్ బుర్ర వంశీ.. నిత్యం సాధన ద్వారా హాఫ్ మారథాన్‌ను సులువగా అధిగమించారు. ఇప్పటికే కొన్ని పరుగు పందెల్లో పాల్గొని తన సత్తా చాటారు. మరిన్ని పరుగు పందెలు, మారథాన్‌లకు హాజరవుతానని తెలిపారు. - వంశీ



నిరంతర సాధనతోనే సాధ్యం..

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ నలిగొండ అంజయ్య హాఫ్ మారథాన్ పూర్తి చేశారు. 21 కిలోమీటర్లను సునాయసంగా పూర్తిచేసిన అంజయ్య.. గతేడాది నిర్వహించిన మారథాన్‌లో ప్రతిభ చాటారు. పోలీసు మీట్‌లోనూ 5 కిలోమీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారు. నిరంతరం సాధన చేయడం ద్వారా హాఫ్ మారథాన్ సులువుగా అధిగమించగలిగానని వెల్లడించారు. - అంజయ్య



తోటి ఉద్యోగుల స్ఫూర్తితో.. - వెంకటేశ్

పరుగు పూర్తి చేస్తాననే నమ్మకం లేనప్పటికీ. . తోటి ఉద్యోగుల స్ఫూర్తితో విజయం సాధించానని మిడిదొడ్డి వెంకటేశ్ తన అనుభవాన్ని తెలిపారు. తొలి ప్రయత్నంలోనే హాఫ్ మారథాన్ అధిగమించినట్లు రామగుండం కమిషనరేట్ పరిధి కానిస్టేబుల్ వెల్లడించారు. ఉద్యోగంలో చేరిన తరువాత పరుగుపై దృష్టి సారించలేదని.. మారథాన్‌లో పాల్గొనాలని తోటి మిత్రుల సూచన మేరకు సాధన చేశానన్నారు.



ఆత్మవిశ్వాసం పెరిగింది - శ్రీకాంత్

తొలిసారిగా కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పాల్గొని ప్రతిభను వెలికి తీశారు.. ఏఆర్ కానిస్టేబుల్ రాళ్లబండి శ్రీకాంత్. రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ తొలి ప్రయత్నంలోనే విజయవంతమయ్యారు. దీంతో మరింత ఆత్మస్థైర్యం పెరిగిందని, రానున్న కాలంలో మరిన్ని పోటీలకు హాజరవుతానన్నారు.



మరింత ప్రయత్నం చేస్తాను - రవి

హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ రవి.. తొలిసారి హాఫ్ మారథాన్‌లో పాల్గొని 10 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఇందులో పాల్గొనడంతో తనకున్న శక్తి తెలిసిందన్నారు. ఇకపై మరింత సాధన, ప్రయత్నం చేస్తూ.. మారథాన్‌లో పాల్గొంటానన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, కోరుట్ల

? కోరుట్ల పట్టణం బస్టాండ్ ఏరియాలో రహదారిపైనే పండ్ల, పూల, ఇతర దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. - **రాజేశ్, కోరుట్ల**

✓ వెంటనే పురపాలక సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేయించి బస్టాండ్ వద్ద, రహదారిపై పెడుతున్న దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకుంటా. - **ప్రవీణ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి**

? నేను 2023 సెప్టెంబరులో ప్యాక్స్‌లో రూ.లక్ష రుణం తీసుకుంటే రూ.90 వేలు మాత్రమే నా ఎస్‌బీ ఖాతాకు జమచేయగా ప్రస్తుతం రూ.2 లక్షల బకాయి చూపిస్తున్నారు.? - జనగం రాములు, మల్యాల

✓ తీసుకున్న రుణంకన్నా రెట్టింపుగా నమోదైన పలువురి రైతులుండగా వీరి నుంచి ఫిర్యాదులు తీసుకుని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు నివేదిస్తున్నాము. - **బి.వాణి, జిల్లా వ్యవసాయాధికారిణి, జగిత్యాల**

– న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

సారంగాపూర్, న్యూస్‌టుడే: విద్యతోపాటు క్రీడా నైపుణ్యం ఉన్న గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లెలో వినయ్, ఉమేష్ స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తుందని, పాఠశాల స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయన్నారు. కేడీసీసీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, పాత రమేష్, చెర్పూరి సుభాష్, గుడిసె జితేందర్, రిక్కల ప్రభాకర్, ఎల్ల సుశీన్, చుంచు అభిలాష్‌యాదవ్, సూద నారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


విద్యార్థులతో ప్రిన్సిపల్ లావణ్య

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొడిమ్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అనూప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ అండర్-17 విభాగంలో ఆరెల్లి శ్రీతేజ, ఖోఖో అండర్-17 విభాగంలో గుడిపెల్లి ధనుష్, అండర్-14 విభాగంలో గుడిపెల్లి విష్ణువర్ధన్, వాలీబాల్ అండర్-14 విభాగంలో చిట్టిపెల్లి లోకేష్, క్రికెట్ అండర్-14 విభాగంలో అబ్దుల్ ఇబ్రహీం ఎంపికయ్యారని, విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారి దర్శనం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు బీర్నంది నర్సింహాచారి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు చేపట్టగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కొలిచారు.



దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం


వెల్లుల్లో..

జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాల్లో భక్తులు దుర్గామాల స్వీకరించారు. అమ్మవారి విగ్రహాలను డప్పుచప్పుల్ల నడుమ మంగళహారతులతో ఊరేగింపుగా మంటపానికి తీసుకువచ్చారు. అమ్మవారు శైలపుత్రి అవతారంలో దర్శనమిచ్చారు.
– న్యూస్‌టుడే యంత్రాంగం


మల్యాలలో.. దుర్గాదేవి శోభాయాత్రలో విద్యార్థుల నృత్యాలు


సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో..


మెట్‌పల్లి పట్టణంలో ఆర్యవైశ్యులు


రాయికల్‌లో అమ్మవారి శోభాయాత్ర


కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లిలో..


మల్లాపూర్‌లో..


మేడిపల్లి: తొంబర్రావుపేటలో అమ్మవారి వేషధారణలో చిన్నారులు


పెగడపల్లిలో..


ఎండపల్లి: రాజారాంపల్లిలో..


వెల్గటూరు: పాశిగామలో..

విగ్రహావిష్కరణకు హాజరవ్వాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: కోరుట్లలోని పశువైద్య కళాశాల వద్ద గురువారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. మెట్‌పల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, ప్రభుత్వ విప్‌లు లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రముఖులు రానున్నారని తెలిపారు. శుక్రవారం జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ చేస్తున్నామని, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కొమిరెడ్డి తిరుపతి, జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులున్నారు.

నారసింహుడి ఉత్సవ సేవ


వీధుల్లో స్వామివారి ఊరేగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి అశ్వ వాహన సేవను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ రకాల పూలతో ఉత్సవ మూర్తులను అలంకరించి, మేళతాళాలతో సేవను తిప్పారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. దేవస్థానానికి గురువారం రూ.95,140 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

అందరికీ ఆమోదయోగ్యంగా మాస్టర్ ప్లాన్

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణంలో సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా అందరికీ అమోదయోగ్యంగా ఉండేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారులను కోరారు. రాయికల్ పురపాలక సంఘం ఏర్పాటైన తర్వాత ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురి ఫిర్యాదు మేరకు గురువారం రాయికల్ పుర కార్యాలయంలో అధికారులు, ఛైర్మన్‌తో సమావేశమయ్యారు. మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేస్తూ కౌన్సిల్ సమావేశంలో గతంలో తీర్మానాలు చేసినట్లు అధికారులు పేర్కొనగా తీర్మాన ప్రతుల కాపీని తనకు ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఛైర్మన్ హన్మాండ్లు, కౌన్సిలర్ అనురాధ, రమేష్, రాజారెడ్డి, మహిపాల్‌రెడ్డి, గంగాధర్, దివాకర్, నర్సయ్య, నరేష్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మపురి: పట్టణానికి చెందిన నారవేణి మల్లికార్జున్ ఇటీవల జగిత్యాల పరిధి పొలాస వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడికి డీఎండీ యూత్‌క్లబ్ మిత్రులు రూ.36 వేల ఆర్థిక సాయాన్ని గురువారం ఆసుపత్రిలో అందజేశారు. సభ్యులు లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ధర్మపురి: పట్టణంలో హిందూసేన ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ లీగ్స్ టోర్నీని గురువారం పురపాలకసంఘం అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో 7 క్రికెట్ టీంలు పాల్గొంటున్నట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు

జగిత్యాల పట్టణం: పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామకృష్ణ హైస్కూల్‌లో కళాశాలలో పర్యావరణ పరిరక్షణకు పూల మొక్కలు నాటారు. రామకృష్ణ, రాజేందర్, వెంకటరమేశ్, మునిందర్‌రెడ్డి, దీపిక పాల్గొన్నారు.


పూలమొక్కలు అందజేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ప్రిన్సిపల్ గౌసూర్ రెహమాన్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో గంగాప్రసాద్, ఇమ్రాన్‌ఖాన్, శ్రీనివాస్, స్వరూప, సంధ్య, నవీన, ప్రకాశిత, రాజేశ్వరి పాల్గొన్నారు.


కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేష్‌రెడ్డి నిధులతో మెట్‌పల్లి మండలం రంగారావుపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ, మేడిపల్లిలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మినీ కమ్యూనిటీ హాల్, వేంపేటలో ఓపెన్ జిమ్ పనులకు గురువారం భూమి పూజ చేశారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎల్ల చంద్రయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూరు, డబ్బా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ గురువారం ప్రారంభించారు. గోధూరు గ్రామంలో నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి మినీ కల్యాణ మండపాన్ని, డబ్బా గ్రామంలో భారాస రాజ్యసభ ఎంపీ సురేష్ రెడ్డి ఎంపీ నిధులతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్ భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు దశరథ్‌రెడ్డి, సత్యనారాయణ, చిన్నారెడ్డి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: దేవీ శరన్నవరాత్రులను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా స్వామి వారి రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. పుర వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, మహాజన్ నర్సింలు, కిషోర్, జక్కం బాబు, సురేందర్, పొట్ట ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.


మేడిపల్లిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కుల మతాలకు అతీతంగా అభివృద్ధి

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన 149 మంది మహిళలకు మంజూరైన రూ.49.17 లక్షల కల్యాణలక్ష్మి, 97 మందికి రూ.30 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను గురువారం పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతితో కలిసి అందజేశారు. గిరి నాగభూషణం, వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

శతశాతం రుణమాఫీకి చర్యలు

రాయికల్: అర్హత గల రైతులకు శతశాతం రుణమాఫీకి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులకు పైడిమడుగు ఇండియన్ బ్యాంకులో రుణమాఫీ కాలేదని రైతులు గురువారం ఎమ్మెల్యేకు విన్నవించగా స్పందించి చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి, ముఖ్యమంత్రికి వివరించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం అల్లీపూర్ గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కూనమల్ల ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. గన్నెరాజరెడ్డి, రఘుపతిరెడ్డి,గంప ఆనందం, సుధాకర్, రాజలింగం యాదవ్, మోఖిద్, ప్రవీణ్, శివ, రత్నాకర్‌రావు, జహంగీర్ తదితరులున్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఛైర్‌పర్సన్ జ్యోతి

మద్యానికి బానిసై బలవన్మరణం

బీబీరాజ్‌పల్లి(గొల్లపల్లి): మద్యానికి బానిసై, మానసిక స్థితి సరిగా లేక పోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీరాజ్‌పల్లిలో గురువారం జరిగింది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీరాజ్‌పల్లికు చెందిన రాగల్ల నరేష్(43) కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. మానసిక స్థితి కూడా సరిగా లేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దేవాలయంలో చోరీ

బాలపల్లి(జగిత్యాల గ్రామీణం): జగిత్యాల గ్రామీణ మండలం బాలపల్లిలోని శ్రీ రాజరాజేశ్వరాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దేవాలయంలో చొరబడ్డ దొంగలు కిలో వెండి నాగభరణం, అమ్మవారికి చెందిన అరతులం బంగారు చైన్, అర తులం పుస్తెల తాడును ఎత్తికెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం కేసులో ఒకరి అరెస్టు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ఎలుకబావివాడలో రాపల్లి సౌమ్య బలవన్మరణం కేసులో గురువారం ఆమె భర్త రాపల్లి రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ డి.రఘుచందర్ చెప్పారు. సౌమ్య తల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై భర్త సహా అయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై క్రిష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కొద్ది నెలలుగా కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నాడని గ్రామానికి చెందిన వేల్పుల శ్రీను, వేల్పుల శ్రీకాంత్, వేల్పుల చందు, మరికొందరితో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్న ప్రవీణ్‌ను తోటపల్లి వద్ద అడ్డగించారు. కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్తం

ధర్నా విజయవంతానికి పిలుపు

జగిత్యాల వ్యవసాయం: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని గుల్లపేట, అర్పపల్లితోపాటు పలు గ్రామాల్లో రైతులను కలిశారు. రమేష్‌రెడ్డి, మల్లన్న, కర్నాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

నిరవధిక బంద్‌కు నిర్ణయం

జగిత్యాల పట్టణం: దసరా సెలవుల అనంతరం శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్ని నిరవధికంగా మూసివేస్తామని సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలేదని కనీసం తమ గోడును వినే ప్రయత్నం కూడా చేయకపోవడంతో నిరసనగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చామని పేర్కొన్నారు.

వరద కాలువ వెంబడి పోలీసుల గాలింపు

కోరుట్ల: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన మల్లేశం అనే వ్యక్తి వరద కాలువలోపడి గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో గురువారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కథలాపూర్ మండలం దుంపేట గ్రామశివారు నుంచి మల్యాల మండలం రాంపూర్ వరకు గల వరద కాలువ వెంబడి ఎస్సై నవీన్‌కుమార్ గాలించినట్లు తెలిపారు.

సఖీ కేంద్రంలో కౌన్సెలింగ్

జగిత్యాల: మెట్‌పల్లికి చెందిన ఓ ప్రేమజంట గత నెల 29న పెళ్లి చేసుకోగా అమ్మాయి తల్లిదండ్రులు ఈనెల 1న మెట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు అమ్మాయిని జగిత్యాల సఖీ కేంద్రానికి తరలించారు. అబ్బాయి తరఫున బంధువులు గురువారం ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిశారు. అమ్మాయి మేజర్ కావడంతో అప్పగించాలని కోరారు. అమ్మాయికి సఖీ కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని అమ్మాయి ఇష్టప్రకారం చర్యలు తీసుకుంటారని ఎస్పీ అన్నారు.

3 ఉద్యోగాలు... 139 దరఖాస్తులు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని సఖీ కేంద్రంలో మూడు ఉద్యోగాల కోసం 139 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టు భర్తీకి అవకాశం ఉండగా 42 మంది, కేస్ వర్కర్ పోస్టుకు 65 మంది, సెక్యూరిటీ గార్డు పోస్టుకు 32 మంది దరఖాస్తు చేశారు. జిల్లా మహిళలు, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న ధ్రువపత్రాల పరిశీలన, 16న అభ్యంతరాల స్వీకరణ, 21న మౌఖిక పరీక్షలు, 23న తుది ఎంపిక చేపట్టనున్నారు.

సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయండి

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: బీసీ కులగణన చేపట్టి, బీసీలకు 42శాతం రిజర్వేన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లిలో బీసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో 9న చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని బీసీ సంఘాల ప్రతినిధులు సమావేశమై మాట్లాడారు. పుప్పాల లింబాద్రి, నల్ల వెంకటేశం, తుల రాజేందర్ పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే

కోరుట్ల: సర్వరాజ్‌పల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద డిజిటల్ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వేను గురువారం తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 150 కుటుంబాలు ఉండగా 47 కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. అయిదు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ప్రజల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు.

రహదారుల మరమ్మతులకు నిధుల మంజూరు

కోరుట్ల: కథలాపూర్ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.10 లక్షల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగరాజు గురువారం తెలిపారు. భూషణరావుపేట-ఆత్మకూర్ రోడ్డుకు రూ.లక్ష, పోతారం-కలిగోట రోడ్డుకు రూ.79వేలు, చింతకుంట రోడ్డు రూ.1.20 లక్షలు, సిరికొండ-కోనరావుపేట రోడ్డుకు రూ.90వేలు, కథలాపూర్-చింతకుంట రోడ్డుకు రూ.60వేలు, తక్కళ్లపెల్లి-గంబాపూర్ రోడ్డుకు రూ.2.39 లక్షలు, తుర్తి-రుద్రంగి రోడ్డుకు రూ.1.62 లక్షలు, సిరికొండ-కొండ్రికర్ల రోడ్డుకు రూ.90వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు

జగిత్యాల: రాష్ట్ర మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం జిల్లా భారాస కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి హోదాలో సంస్కారహీనంగా సినీతారలను కించపరిచే విధంగా మాట్లాడడం మంచిదికాదని కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మహిళా మంత్రులను ముందుపెట్టి చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కొలేక నీచ సంస్కృతికి దిగజారుతున్నారని బేషరతుగా కేటీఆర్‌కు సినీపరిశ్రమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: మండలంలోని ఆత్మకూర్ పెద్దచెరువు, బొమ్మెనకుంట, ఎల్లమ్మకుంట స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. పెద్దచెరువుతో పాటు కుంట స్థలాలను చదును చేసి మొరం పోస్తూ కబ్జాకు పాల్పడుతున్నారన్నారు. దీనివల్ల ఆయా నీటి వనరుల్లో నీటి నిల్వ శాతం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రేమికులను బెదిరించిన ఇద్దరిపై కేసు

నవీపేట : ఓ ప్రేమజంటపై ఇద్దరు యువకులు బెదిరింపులకు పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేటలో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన యువతి (21), యువకుడు (22) ద్విచక్రవాహనంపై బుధవారం నిర్మల్ జిల్లా బాసర వెళ్లేందుకు బయల్దేరారు. నవీపేట శివారులోకి రాగానే సదరు ప్రేమజంట కొద్ది సేపు రోడ్డు పక్కన ఆగారు. అటుగా వెళ్తున్న ఇద్దరు యువకులు ఆగి ఉన్న ప్రేమికుల ఫొటోలు తీశారు. డబ్బులు ఇవ్వాలని లేకుంటే ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేస్తామని బెదిరించారు. అనంతరం యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రేమికులు ఠాణాకు వచ్చి జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బెదిరింపులకు పాల్పడిన వారు నవీపేటకు చెందిన ఇద్దరు యువకులుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తిపై దాడి

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన కోయల్‌కార్ రాజేందర్‌పై ఎల్లమ్మ ఆలయం సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయం సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద పెట్రోల్ పోయించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు కర్రతో తలపై దాడి చేశారన్నారు. తలకు గాయాలు కావడంతో మెట్‌పల్లి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. కొన్ని రోజుల కిందట ఇలాగే కర్రతో దాడి చేసి పారిపోయారన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.